
ప్రత్యేక అలంకరణలో యాగంటి ఉమామహేశ్వరుడు


డోన్: పాతబుగ్గలో..


డోన్: రైతు నగర్ శివాలయంలో..


కోవెలకుంట్లలో..


కోవెలకుంట్ల: ఉమామహేశ్వరులకు గ్రామోత్సవం

కల్యాణ వైభోగం

- ఘనంగా మహాశివరాత్రి ఉత్సవాలు
- శాస్త్రోక్తంగా శివపార్వతుల కల్యాణోత్సవం
- శైవ క్షేత్రాలకు పోటెత్తిన భక్తులు


యాగంటిలో స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు, చిత్రంలో మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

బనగానపల్లె: మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం శివపార్వతుల కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. ప్రముఖ శైవక్షేత్రమైన యాగంటిలో బుధవారం అర్ధరాత్రి లింగోద్భవ కాల పూజలు నిర్వహించారు. అనంతరం శివపార్వతుల ఉత్సవ విగ్రహాలను పట్టువస్త్రాలు, పుష్పాలతో వధూవరులుగా అలంకరించారు. వేదమంత్రాలు, భక్తుల శివనామస్మరణ నడుమ స్వామివారి కల్యాణాన్ని కనుల పండువగా నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి సహా వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామివారి కల్యాణాన్ని తిలకించారు. గురువారం సాయంత్రం నందికోల ఉత్సవాన్ని సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ఆలయ ఈఓ చంద్రుడు, యాగంటిపల్లె ఉపసర్పంచ్ మల్లీశ్వరరెడ్డి పాల్గొన్నారు.

కనుల పండువగా కల్యాణోత్సవం

డోన్ టౌన్: పట్టణంలోని పాతబుగ్గ, కొత్త బుగ్గలో పరమేశ్వరుడి కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. అలాగే పాతపేట, నగరేశ్వరస్వామి ఆలయం, రామలింగేశ్వర ఆలయం, సాంబ శివాలయం, ఇందిరానగర్, వైఎస్‌నగర్, రైతునగర్ తదితర కాలనీల్లోని ఆలయాల్లో విశేష పూజలు జరిగాయి.

వైభవం.. ఉమామహేశ్వరుల కల్యాణం

కోవెలకుంట్ల: శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని గురువారం తెల్లవారుజామున ఉమామహేశ్వరుల కల్యాణోత్సవం వేడుకగా సాగింది. కోవెలకుంట్ల పట్టణంలోని గాంధీసెంటర్‌లో పంచముఖ సిద్దేశ్వర స్వామి, కాశీవిశ్వనాథుని ఆలయం, ఏడుకొప్పెర్ల బావి సమీపంలోని అగస్తీశ్వర స్వామి ఆలయం, గాంధీనగర్‌లోని అయ్యప్పస్వామి దేవాలయ ఆవరణలో వెలసిన శివాలయం, బనగానపల్లె చౌరస్తాలో నాగలింగేశ్వరస్వామి, జుర్రేరు ఒడ్డున ఉన్న శివాలయం, రంగరాజుపేట కాళికామాత నాగలింగేశ్వరస్వామి ఆలయాల్లో స్వామివారి కల్యాణోత్సవం కనులపండువగా జరిగింది. మహన్యాసపూర్వక విశేష పంచామృతాభిషేకం, రుద్రాభిషేకం తదితర పూజలు జరిగాయి. కల్యాణం అనంతరం స్వామివార్ల గ్రామోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

కల్యాణం.. కమనీయం

బేతంచెర్ల: ముచ్చట్ల భ్రమరాంబ మల్లిఖార్జున స్వామి ఆలయంలో గురువారం తెల్లవారుజామున స్వామివారి కల్యాణం కనుల విందుగా జరిగింది. అర్చకులు నరేష్ శర్మ, చంద్రశేఖర్‌శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే పూదోట మఠంలోని భేతేశ్వరస్వామి, సిద్ధేశ్వరస్వామి, బనగానపల్లె రహదారిలోని జఠాధర స్వామి, యంబాయిలో వెలసిన రామలింగేశ్వరస్వామి, భోగేశ్వరస్వామి, సిమెంటునగర్‌లోని జీవబుగ్గలింగేశ్వరస్వామి, ఆర్ఎస్ రంగాపురం, ముద్దవరం, ముసలాయిచెరువు, బైనపల్లె గ్రామాల్లోని స్వామివారి ఆలయాల్లో కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. సాయంత్రం స్వామిఅమ్మవారి ఉత్సవ విగ్రహాలను నంది వాహనంపై ఊరేగించారు. ఆయా కార్యక్రమాల్లో గ్రూప్ దేవాలయాల ఈఓ మద్దిలేటి, ఆలయ మాజీ చైర్మన్ జగన్‌మోహన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

- **ప్యాపిలి:** స్థానిక నీలకంఠేశ్వరస్వామి ఆలయం, మెట్టుపల్లి, పెద్దపొదిళ్ల, గొల్లపల్లి బుగ్గ రామలింగేశ్వర స్వామి ఆలయం, పీఆర్‌పల్లిలోని పంచలింగాల ఆలయంతో పాటు పలు శివాలయాల్లో ఆదిదంపతుల కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. రాత్రి భక్తజన సందోహం మధ్య శివపార్వతుల గ్రామోత్సవాన్ని నిర్వహించారు.


బేతంచెర్ల: శివపార్వతుల ఊరేగింపు


బేతంచెర్ల: ముచ్చట్ల మల్లికార్జునస్వామి ఆలయంలో..


ఎంబాయి భోగేశ్వరస్వామి కల్యాణం

- **కొలిమిగుండ్ల:** మండల పరిధిలోని అంకిరెడ్డిపల్లె శివాలయంలో శివపార్వతుల కల్యాణం నిర్వహించారు. వేదపండితులు స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. వేదమంత్రాలు, మేళతాళాల మధ్య శివపార్వతుల కల్యాణం జరిపించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.


కొలిమిగుండ్ల: కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు

క్లుప్తంగా

సేంద్రియ ఎరువులే ఉత్తమం


రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు

ప్యాపిలి: రైతులు పంట దిగుబడులు పెంచుకునేందుకు సేంద్రియ ఎరువులను విరివిగా వాడాలని ఏడీఏ అశోక్‌వర్ధన్ రెడ్డి, వ్యవసాయాధికారి రాజేశ్, ఉద్యానశాఖ అధికారిణి కళ్యాణి అన్నారు. మండల పరిధిలోని చంద్రపల్లి గ్రామంలో గురువారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా చీడపీడల నివారణతో పాటు అధిక దిగుబడులు పొందవచ్చన్నారు. రసాయనిక మందులను వాడటం ద్వారా పెట్టుబడి వ్యయం పెరగడంతో పాటు భూసారం తగ్గిపోతుందని తెలిపారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయం మాస్టర్ ట్రైనర్ రామాంజనేయులు పాల్గొన్నారు.

కార్పెంటర్స్ అసోసియేషన్ ఎన్నిక


నూతన కార్యవర్గాన్ని అభినందిస్తున్న కార్పెంటర్లు

బనగానపల్లె రూరల్: కార్పెంటర్స్ మండల నూతన కార్యవర్గాన్ని గురువారం ఎన్నుకున్నారు. అసోసియేషన్ మండల అధ్యక్షుడిగా షేక్ ఖాదర్‌బాషా, ఉపాధ్యక్షుడిగా పి.అక్బర్‌అలీఖాన్, సెక్రటరీ వహిద్‌ఖాన్, ట్రెజరర్ సమ్మద్, ఆసీఫ్‌బాషా, షబ్బీర్‌లను ఎనుకున్నారు. ఈ సందర్భంగా ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రంగబాబు మాట్లాడుతూ.. కార్పెంటర్స్ ఐకమత్యంగా ఉండాలని సూచించారు. ఈ రంగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా కార్మికులు మారాలన్నారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని సన్మానించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి షేక్ షంషీర్, ఎం.నబీరసూల్, తాడిపత్రి టౌన్ అధ్యక్షుడు ఎంఎస్ బాషా, కోవెలకుంట్ల మండల అధ్యక్షుడు రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఆటో బోల్తా.. కూలీలకు గాయాలు


స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్న కూలీలు

బనగానపల్లె రూరల్: ఆటో బోల్తా పడి మహిళా కూలీలకు గాయాలైన ఘటన గురువారం బనగానపల్లె మండలం తమ్మడపల్లె సమీపంలో చోటుచేసుకుంది. బాధితుల వివరాల మేరకు.. బనగానపల్లె పట్టణంలోని తెలుగుపేట, కొండపేటకు చెందిన 15 మంది వ్యవసాయ కూలీలు పని నిమిత్తం ఆటోలో శివవరం గ్రామానికి వెళ్తున్నారు. తమ్మడపల్లె సమీపంలో ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో వెంకటలచ్చమ్మ, పాంషాబి, కె.నాగమణి తీవ్రంగా గాయపడ్డారు. వారిని నంద్యాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అలాగే ఆటో డ్రైవర్ వలితో పాటు తులసమ్మ, లక్ష్మీదేవి, సుహాషిని, హసీనాబేగం, వెంకటేశ్వరమ్మ, నారాయణమ్మ, నసీమాబేగం, ప్రభావతి, ఖాజాబి, ఎస్.నాగమణి, సాలమ్మకు స్వల్ప గాయాలయ్యాయి. బనగానపల్లె పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సభ్యత్వ నమోదుకు శ్రీకారం


సభ్యత్వం తీసుకుంటున్న న్యాయవాదులు

డోన్ టౌన్: భారత న్యాయవాదుల సంఘం (ఐఏఎల్) సభ్యత్వ నమోదుకు గురువారం శ్రీకారం చుట్టారు. స్థానిక కోర్టు ఆవరణలో ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి రాగుల రాముడు, ఉమ్మడి కర్నూలు జిల్లా అధ్యక్షుడు కృష్ణయ్య, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శివరామకృష్ణ ప్రారంభించారు. న్యాయవాదులపై దాడులు పెరిగిపోతున్నాయని.. నివారించడం కోసం అడ్వకేట్ ప్రొటెక్షన్ యాక్ట్ అమలు కోసం ఉద్యమించాలని పిలుపునిచ్చారు. డోన్ బార్ కౌన్సిల్ అధ్యక్షుడు వేణుగోపాల్ గౌడ్, సభ్యులు శ్యాంసుందర్, శ్రీనివాసులు, నారాయణ, మద్దయ్య, రవికుమార్, మహ్మద్‌రఫీ, రవిమోహన్, ఓబయ్య పాల్గొన్నారు.

అనాథాశ్రమానికి నిత్యావసర సరుకులు


సరుకులు పంపిణీ చేస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

బేతంచెర్ల: పట్టణ సమీపంలోని నంద్యాల రోడ్డులో ఉన్న అన్నపూర్ణ అనాథ ఆశ్రమానికి లయన్స్ క్లబ్ సభ్యులు గురువారం నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. క్లబ్ సభ్యుడు బండికారి వెంకటయ్య మనవరాలు షణ్ముఖ ప్రియ సహకారంతో వీటిని అందజేసినట్లు క్లబ్ అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి తెలిపారు. క్లబ్ సభ్యులు వలిబాషా, మనోహర్‌రెడ్డి, కేశాలు నాయుడు పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి

డోన్ రూరల్: ప్రజలకు అందుబాటులో ఉంటూ మెరుగైన వైద్య సేవలు అందించాలని డిప్యూటీ డీఎంహెచ్ఓ, జిల్లా టీబీ అధికారి డాక్టర్ ఎం.శారద అన్నారు. గురువారం డోన్ మండలం ఉంగరానిగుండ్ల గ్రామాన్ని సందర్శించారు. టీబీ, లెప్రసీ, హెచ్ఐవీ వ్యాధిగ్రస్తులకు అందుతున్న సేవల గురించి ఆరా తీశారు. పౌష్టికాహారం, కేంద్ర ప్రభుత్వం నుంచి అందుతున్న ఆర్థిక సహాయం గురించి రోగులను అడిగి తెలుసుకున్నారు. రోగులకు సక్రమంగా వైద్య సేవలు అందించాలని.. ఎప్పటికప్పుడు మందులు పంపిణీ చేయాలని సూచించారు. పలు రికార్డులను పరిశీలించారు.


వైద్య సిబ్బందికి సూచనలు చేస్తున్న డిప్యూటీ డీఎంహెచ్ఓ

కొత్తబురుజు ప్రాథమిక వైద్యశాల డాక్టర్ వసంత్, హెల్త్ సూపర్‌వైజర్ కె.చంద్రశేఖర్, ఈశ్వర్, అరుణ్, ల్యాబ్ సూపర్‌వైజర్ ఉపేంద్ర, కరీముల్లా, ఆశావర్కర్లు ఉన్నారు.

ఫార్మర్స్ రిజిస్ట్రేషన్ ప్రామాణికం

కోవెలకుంట్ల: కేంద్ర ప్రభుత్వం అందించే పీఎం కిషాన్‌తో పాటు వివిధ వ్యవసాయ పథకాల వర్తింపునకు అర్హత సాధించాలంటే ఫార్మర్స్ రిజిస్ట్రేషన్ ప్రామాణికమని మండల వ్యవసాయాధికారి నిరంజన్ అన్నారు. పట్టణంలోని రైతు సేవా కేంద్రంలో గురువారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కోవెలకుంట్ల మండలంలో 13 వేల పట్టాదారు పాసుపుస్తకాలు కలిగిన రైతులు ఉండగా ఇప్పటి వరకు 5 వేల మంది రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని తెలిపారు. రైతులు ఆధార్‌కార్డు, పాస్‌పుస్తకం జిరాక్స్ కాపీలు, ఆధార్‌కు లింక్ అయిన మొబైల్ నంబర్ తీసుకుని రైతు సేవా కేంద్రాల్లో రిజిస్టర్ చేయించుకోవాలని పేర్కొన్నారు.

ఆరుతడి పంటలు సాగు చేయాలి

డోన్ రూరల్: వేసవిలో బోర్ల కింద వ్యవసాయం చేసే రైతులు కూరగాయలు వంటి ఆరుతడి పంటలు మాత్రమే సాగుచేసుకోవాలని.. లేకుంటే ఎండ తీవ్రతకు నష్టపోయే ప్రమాదం ఉందని మండల వ్యవసాయ అధికారి అబ్దుల్ షఫి అన్నారు. మండల పరిధిలోని చిన్నమల్కాపురం, కమలాపురం గ్రామాల్లో గురువారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. రైతులు ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. పేర్లు నమోదు చేసుకున్న రైతులకే కేంద్రరాష్ట్ర పథకాలు వర్తిస్తాయని తెలిపారు. రైతులకు అవగాహన కల్పించారు. గ్రామ వ్యవసాయ సహాయకులు నాగ సులోచన, ఝాన్సీ పాల్గొన్నారు.

చంద్రశేఖర్ ఆజాద్ ఆశయాలను సాధిద్దాం

డోన్ రూరల్: స్వాతంత్ర్య సమరయోధుడు చంద్రశేఖర్ ఆజాద్ ఆశయాలను సాధిద్దామని ఏఐవైఎఫ్ జాతీయ కార్యదర్శి నక్కి లెనిన్‌బాబు అన్నారు. పట్టణంలోని నక్కి రామన్న భవనంలో గురువారం చంద్రశేఖర్ ఆజాద్ వర్ధంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆజాద్ దేశ స్వాతంత్రం కోసం అనేక పోరాటాలు చేశారన్నారు. యువత ఆయన అడుగుజాడల్లో నడవాలని పిలుపునిచ్చారు. ఏఐవైఎఫ్ నాయకులు సూర్యప్రతాప్, పులిశేఖర్, శశిధర్ తదితరులు పాల్గొన్నారు.

ముందస్తు చర్యలు తీసుకోండి

అవుకు: వేసవిలో నీటి సమస్య తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి అన్నారు. అవుకు మండలం చెర్లోపల్లి కొండపై ఉన్న సీపీడబ్ల్యూఎస్ ప్రాజెక్టును గురువారం పరిశీలించారు. అవుకులో ఏర్పాటు చేసిన సీపీడబ్ల్యూఎస్ స్కీం ద్వారా అవుకు, కొలిమిగుండ్ల మండలాలకు తాగునీటి సరఫరా జరుగుతోందన్నారు. పైప్‌లైన్ల లీకేజీ లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అలాగే రిజర్వాయర్‌లో నీటి నిల్వను ఎప్పటికప్పుడు పరిశీలించాలని సూచించారు. అనంతరం అవుకు ఎంపీడీఓ కార్యాలయాన్ని సందర్శించి పలు రికార్డులను పరిశీలించారు. ఆయన వెంట ఏఓ రాములు, ఏఈ సాయికృష్ణ ఉన్నారు.

డి. రంగాపురంలో నీటి ఎద్దడి

ప్యాపిలి: మండల పరిధిలోని డి. రంగాపురం గ్రామంలో నాలుగు రోజులుగా తీవ్ర నీటి ఎద్దడి నెలకొంది. గ్రామస్తులకు శివరాత్రి పండుగ రోజు కూడా క్షటన్నీటి కష్టాలు తప్పలేదు. గ్రామంలోని బోర్లు మొరాయించడంతో నీటి సమస్య తలెత్తింది. మరమ్మతులు చేపట్టాల్సిన అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామంలో నెలకొన్న నీటి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

ఉచితంగా చికెన్ పంపిణీ



డోన్ టౌన్: బర్డ్‌ఫ్లూతో వ్యాపారాలు పడిపోవడంతో ప్రజల్లో అవగాహన కల్పించేందుకు పట్టణంలో గురువారం ఉచితంగా చికెన్ ఫ్రై, పకోడా, మంచూరియా, బాయిల్డ్ ఎగ్ పంపిణీ చేశారు. వెంకాబ్ చికెన్ డీలర్ అయిన ఏ1 చికెన్ సెంటర్ నిర్వాహకులు, పట్టణంలోని చికెన్ వ్యాపారులు స్థానిక పాత బస్టాండ్-రైల్వే స్టేషన్ రోడ్డులో పంపిణీ చేయగా జనం ఎగబడ్డారు. వ్యాధి గురించి భయపడాల్సిన అవసరం లేదని.. చికెన్‌ను అత్యధిక వేడితో వండుకుని తింటే ఏమీ కాదని వ్యాపారులు తెలిపారు.

ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

బేతంచెర్ల: మండలంలో ఇంటర్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంఈఓ సోమశేఖర్ తెలిపారు. గురువారం గోరుమానుకొండ ఏపీ మోడల్ స్కూల్, జూనియర్ కళాశాలలోని పరీక్ష కేంద్రాన్ని చీఫ్ సూపరింటెండెంట్ మరియదాసు, డిపార్ట్‌మెంటల్ అధికారి రాజా దిలీప్‌కుమార్‌తో కలిసి పరిశీలించారు. మార్చి 1వ తేదీ నుంచి పరీక్షలు ప్రారంభం అవుతాయని తెలిపారు. విద్యార్థులు ఉదయం 8:30 గంటలకే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. 9 గంటల తర్వాత ఒక్క నిమిషం ఆలస్యమైనా అనుమతించమని స్పష్టం చేశారు. ప్రథమ సంవత్సరం 559, ద్వితీయ సంవత్సరం 385 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నట్లు వెల్లడించారు.

రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం


మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

బనగానపల్లె: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తోందని.. ప్రశ్నించిన వారిపై అక్రమ కేసులు బనాయిస్తోందని బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి అన్నారు. పట్టణంలోని ఆయన స్వగృహంలో గురువారం మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు రాష్ట్ర వ్యాప్తంగా అనేక మంది వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయించి జైలుకు పంపారన్నారు. బుధవారం హైదరాబాద్‌లో సినీరచయిత, దర్శకుడు పోసాని మురళీకృష్ణను కూడా రెడ్‌బుక్ రాజ్యాంగంలో భాగంగానే అరెస్టు చేశారని ఆరోపించారు. లోకేష్ కనుసన్నల్లో పోలీసులు పనిచేస్తున్నారని పేర్కొన్నారు. చంద్రబాబునాయుడు అవలంబిస్తున్న నియంతృత్వ పాలనపై ఎవరైన నిలదీస్తే అక్రమ కేసులతో అరెస్టు చేయడం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమే అన్నారు. రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ లేకుండా చేయాలనే ఉద్దేశంతోనే రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తున్నారని ఆరోపించారు. ఇలాంటి ధోరణి ప్రజాస్వామ్యానికి మంచిది కాదని అన్నారు. కూటమి ప్రభుత్వానికి కోర్టులు, న్యాయవ్యవస్థలు అంటే లెక్కలేదని విమర్శించారు. సూపర్‌సిక్స్ పథకాలు అమలు చేయకుండా ప్రజల దృష్టిని మళ్లించేందుకు ఇవన్నీ చేస్తున్నారన్నారు. కూటమి పార్టీలకే ప్రజలు తగిన బుద్ధి చెబుతారన్నారు.

హోరాహోరీగా బండలాగుడు పోటీలు


పోటీలను ప్రారంభిస్తున్న జెడ్పీచైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి

కొలిమిగుండ్ల: పెట్నికోట సమీపంలో గుండుమల్లేశ్వరస్వామి ఉత్సవాలను పురస్కరించుకుని గురువారం సాయంత్రం నిర్వహించిన రాష్ట్ర స్థాయి బండలాగుడు పోటీలు హోరాహోరీగా సాగాయి. పాలపళ్ల సైజు విభాగం పోటీలను జెడ్పీచైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి ప్రారంభించారు. వివిధ ప్రాంతాల నుంచి ఏడు జతల ఎడ్లు పాల్గొన్నాయి. పోటీలు తిలకించేందుకు చుట్టు పక్కల గ్రామాల నుంచి భారీగా తరలివచ్చిన జనం ఈలల, కేకలు వేస్తూ ఎడ్ల యజమానులను ప్రోత్సహించారు. రసవత్తరంగా సాగిన పోటీల్లో వైఎస్సార్ జిల్లా గుండ్లకుంటకు చెందిన మర్రిబోయిన వంశీయాదవ్, ప్రొద్దుటూరు మండలం నాగాయపల్లెకు చెందిన వర్ష ఎద్దులు ఎక్కువ దూరం లాగి మొదటి స్థానంలో నిలిచాయి. దొర్నిపాడుకు చెందిన బత్తుల మనోహర్‌యాదవ్ ఎడ్లు రెండో స్థానం దక్కించుకున్నాయి. సంజామల మండలం ముక్కమల్లకు చెందిన మూసాని చంద్రశేఖర్‌రెడ్డి ఎడ్లు మూడో స్థానాన్ని కైవసం చేసుకున్నాయి. బేతంచెర్ల మండలం అంబాపురంకు చెందిన కురువ వెంకట్రాముడు ఎడ్లు నాల్గో స్థానం, బనగానపల్లె మండలం రామకృష్ణాపురానికి చెందిన నాగేంద్ర ఎద్దులు ఐదో స్థానంలో నిలిచాయి. గెలుపొందిన ఎడ్ల యజమానులకు దాతల సహకారంతో వరుసగా రూ.30వేలు, రూ.20వేలు, రూ.10వేలు, రూ.5వేలు, రూ.2,500 చొప్పున నగదు బహుమతులను జెడ్పీచైర్మన్ చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు ఎర్రబోతుల ఉదయ్‌భాస్కర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.




విజేతకు బహుమతి అందజేస్తున్న నిర్వాహకులు

బండలాగుడు విజేత తాడిపత్రి

ప్యాపిలి: మండల పరిధిలోని మెట్టుపల్లి కాకనవరం రామలింగేశ్వరస్వామి ఆలయం ఆవరణలో నిర్వహించిన బండలాగుడు పోటీల్లో అనంతపురం జిల్లా తాడిపత్రి వృషభాలు విజేతగా నిలిచాయి. మహాశివరాత్రి సందర్భంగా గురువారం నిర్వహించిన పోటీల్లో నాగూరు రాజశేఖర్ రెడ్డి వృషభాలు విజేతగా నిలిచి రూ.40 వేలు గెలుచుకున్నాయి. డోన్ మండలం కొత్తకోట కంబయ్యకు చెందిన వృషభాలు ద్వితీయ స్థానంలో నిలిచి రూ. 30 వేలు గెలుచుకున్నాయి. బోగోలు గ్రామానికి చెందిన శేషన్న, మల్యాల గ్రామానికి చెందిన మైమున్నకు చెందిన వృషభాలు తృతీయ స్థానంలో నిలిచి రూ. 20 వేలు, మునగాల గ్రామానికి చెందిన పెద్దయ్య వృషభాలు నాలుగో స్థానంలో నిలిచి రూ. 10 వేలు గెలుచుకున్నాయి. విజేతలకు నిర్వాహకుల చేతుల మీదుగా నగదు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు మెట్టు నాగపురుషోత్తం రెడ్డి, మెట్టు వెంకటేశ్వర రెడ్డి, చంద్రకళాధర్ రెడ్డి, లోకేశ్, శివారెడ్డి, వంశపారంపర్య ధర్మకర్త మెట్టు రామేశ్వరరెడ్డి, కె.మధుసూదన్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, విఘ్నేశ్వర్ రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, కృష్ణారెడ్డి, శివ, సుబ్బన్న తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారికి వెండి వడ్డాణం కానుక

డోన్ టౌన్: పట్టణంలోని కొండపేటలో వెలసిన యల్లమాంభేశ్వరి అమ్మవారికి మహేష్ గౌడ్ దంపతులు వెండి వడ్డాణం కానుకగా అందజేశారు. గురువారం అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించి కుంకుమార్చన, అభిషేకాలు నిర్వహించి వడ్డానం అలంకరించారు. అలాగే టైలర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆలా మల్లికార్జున అన్నదాన కార్యక్రమానికి 108 స్టీల్ ప్లేట్స్‌ను అందజేశారు. శివరాత్రి సందర్భంగా చింతలపేట గ్రామానికి చెందిన నరసింహారెడ్డి ఆర్థిక సాయంతో మధ్యాహ్నం అన్న ప్రసాద వితరణ చేపట్టినట్లు ఆలయ ధర్మకర్త ఏఈ నాగరాజు తెలిపారు.


అమ్మవారికి వడ్డాణం అలంకరిస్తున్న భక్తురాలు

నాటుసారా స్వాధీనం

డోన్ రూరల్: నాటుసారా విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని ఎక్సైజ్ సీఐ వరలక్ష్మి హెచ్చరించారు. స్థానిక ఎక్సైజ్ కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ప్యాపిలి మండలం అలేబాదు తండా, వెంగళాంపల్లి గ్రామాల్లో దాడులు నిర్వహించామని తెలిపారు. అలేబాదుతండా గ్రామంలో ముదావత్ నాయక్ నాటుసారా విక్రయిస్తుండగా అదుపులోకి తీసుకున్నామని చెప్పారు. అతని వద్ద నుంచి 50 లీటర్ల నాటుసారా, ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. అలాగే వెంగళాంపల్లి గ్రామంలో మరో వ్యక్తి నుంచి 15 మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు వివరించారు. ఆమెతో పాటు కానిస్టేబుల్స్ ఉమాకాంత్‌రెడ్డి, గోపాల్ సింగ్, ఇందుమతి తదితరులు ఉన్నారు.


స్వాధీనం చేసుకున్న మద్యాన్ని చూపుతున్న ఎక్సైజ్ సీఐ


కబడ్డీ ఆడుతున్న క్రీడాకారులు


కోలాటం ఆడుతున్న చిన్నారులు

ఉత్సాహంగా కబడ్డీ పోటీలు

బేతంచెర్ల: మండల పరిధిలోని యంబాయి భోగేశ్వరస్వామి ఆలయంలో మహాశివరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని గ్రామస్తులు కబడ్డీ పోటీలను నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి 22 జట్లు హాజరయ్యాయి. ఆయా జట్ల మధ్య హోరాహోరీగా పోటీలు జరిగాయి. ఉత్సవాల సందర్భంగా చిన్నారుల కోలాటం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. సర్పంచ్ యుగంధర్‌రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ భోగప్ప, ఆలయ మాజీ చైర్మన్ చంద్రశేఖరప్ప పాల్గొన్నారు.